# గురివెందపూసల
# తావళం

ఎందుకో చెప్పలేనుగాని, నేటి ఉదయంనుంచీ మనసులో దిగాలుగా ఉంది. నా మనసేదో ప్రమాదాన్ని శంకిస్తోంది. అయితే మాత్రం నిత్యకృత్యాల్లో లోపం ఏముంటుంది గనుక? మామూలుగానే భోజనం చేశాను. దిగులును జయించి దిగమింగడానికి మరికొంచెం ఎక్కువ తిన్నాననడంలో సందేహం ఉండదు. చేయికడుక్కొని తుడుచుకుంటూ నా డ్రాయింగు రూములోకి వచ్చాను. సిగరెట్టు ముట్టిస్తూ ఎందుకో బుర్ర పైకెత్తాను. గోడమీది నా ఫొటో నవ్వుతూ మౌనంగా హెచ్చరిస్తోంది. వీధి తలుపుదగ్గర ఎవరో పిలుస్తున్నారు; ఎవరు చెప్మా! ఈమధ్య అప్పులవాళ్ళ సతాయింపు

లతో నాలోకి నేనే ముడుచుకుపోతున్నాను. కూర్మావతారం లాగ బ్రతకడం నేర్చుకున్నానుకూడా! అంచాతనే నా పేరే దయినప్పటికి ప్రస్తుతంకూర్మావతారమనే పిలుచుకుంటున్నాను.

సరే, తలుపుతీశాను; బ్రతికాను—అప్పులవాళ్ళుకారు. వచ్చినది —— మిత్రుడు గంధం చక్రధరరావు; ఈ మాటు కూర్మావతారం నిర్భయంగా తలెత్తుకోవచ్చును!

చక్రధరరావు విచిత్రమైన మనిషి; సన్నగా, నల్లగా మెరుస్తూ చిరుచెమటలు క్రక్కుతూ, నల్లని ముఖంమీద దరహాస చంద్రికలంటించుకుంటూ ప్రవేశించాడు. లోపలి కాహ్వానించాను. కుర్చీ చూపాను. 'ఏం ఒంటరిగా వచ్చావ్!' అన్నాను. నా ఒంటరి అనే పదానికి అతనికి మాత్రమే అర్థం తెలుసు. మొన్న మొన్ననే కదా—ఎప్పుడూ అతనితో వచ్చే ఆర్టిస్టు ప్రభాకరం—చక్రధరం గురించి చక్కగా వివరించాడు: "వీడు ఎంత తెలివితక్కువ "వెధవో" అంత చక్కని ఆర్టిస్టు!" అని. ఒక ఆర్టిస్టు యింకో వ్యక్తినిగురించి యింత స్పష్టమైన భాషలో చెప్పినప్పుడు ఆ అభిప్రాయాన్ని నేనెలా స్వీకరించకుండా ఉండగలను? ఇంతకీ నేనుమాత్రం అతనెలా మంచి ఆర్టిస్టయాడో చెప్పలేను. అంచాతనే,— ప్రభాకరం చెప్పాడు. నేను కిమ్మనకుండా అంగీకరించాను: అంతే!

చక్రధరరావూ నేనూ ఎదురెదురుగా కుర్చీల్లో కూలబడ్డాం. ఇంకా నవ్వుతూనే ఉన్నాడతను. నిజానికా భావ

ప్రకటనను చిరునవ్వు అని మాత్రమే అంటాను. పరీక్షగా చూస్తే నేగాని తెలియనే లేదు; ఆ చిరునగవులో ఏంచాతనో వెలుగులేదు. ఎందుకో అలా నవ్వుతున్నాడు. మొదట్లో అతన్ని చూడగానే "దరహాస చంద్రికలు" అన్నాను. అంటే కారణం లేకపోయినప్పటికీ అతన్ని చూడగానే ఆ అందమైన సమాసం స్ఫురించడంవల్లనే అన్నానేమో! ఒక్కొక్క సమయంలో మనం తీవ్రమైన దుఃఖాన్ని, మనోవేదననీ దిగమింగుకుందుకు చిరునవ్వును ముఖానికి కప్పుకుంటాం! అంచాతనే చక్రధరం ప్రదర్శిస్తున్నదలాంటి చిరునవ్వు మాత్రమేనేమో?

అతని రాకకు కారణం అడిగాను.

వెంటనే చక్రధరరావు అణకువతో నవ్వి జవాబిచ్చాడు: "మీకు జ్ఞాపకంలేదాండీ—మొన్న మీరు నాకు ఒక వస్తువిస్తానన్నారు కదా!" అన్నాడు.

అవును, జ్ఞాపకం వచ్చింది.

చక్రధరం విచిత్రమైనవ్యక్తి; అన్నానంటే దానికి తగిన కారణాలు లేకపోలేదు! మనిషి సన్నగా పీలగావున్నా మంచి గుండెదిటవు గలవాడు. ఎంత పెంకితనం ఉందో అంత ఛొరవా లేదనడానికి వీల్లేదు.

అతన్ని గురించి నాకూ—నా గురించి అతనికీ చాలా కాలంనుంచి తెలుసున్నా, స్నేహపూర్వకమైన పరిచయమైనది సరిగ్గా పదిహేను రోజులక్రితమే!...ఈమధ్య అతనిరూపంలో

స్పష్టమైన మార్పువచ్చింది. ఎందుకో అన్నవరం వెళ్ళి ఏ పనీ తోచకపోవడంవల్ల ఎందుకేనా మంచిదని సత్యన్నారాయణ మూర్తి సన్నిధానంలో తలతీయించుకొని శిరోజాలు భగవంతుడికి సమర్పించి వచ్చాడు. "మొక్కేమైనా ఉందా?" అంటే—"అబ్బే లేదండి; అలా బుద్ధిపుట్టింది" అంటాడు. మొత్తంమీద అతని మొహం బలే వికృతంగా తయారైంది. ఆ వికారాన్ని కప్పేటందుకు బాగా ముదురు నీలంగుడ్డ టోపీ కుట్టించుకున్నాడు. అది ధరించి వీధుల్లోకి దర్జాగారావడం మొదలుపెట్టాడు. ఆ ఆకారం నాకు చాలా వెగటుగా తోచింది. మామూలుగా బోడితలతో ఉంటే నాకేమీ అభ్యంతరంలేదుగాని ఆ టోపీని ధరించడంమాత్రం నేను భరించలేకపోయాను. ఆ రకం టోపీని చూడగానే బాపూజీ మరణం జ్ఞాపకంవచ్చి దుఃఖం ఆవరించడ మొక్కటే కారణంకాదు; నల్లని ముఖవర్ణంలో ఆ టోపీరంగు కలిసిపోయి చాలా అసహ్యంగా, వికారంగా తయారైందతని ఆకృతి. అంచాతనే అన్నాను; "నా దగ్గరో యీవెనింగ్ హేటుంది. అదిస్తాను; ఉపయోగించుకుని తల వచ్చిన తర్వాత తిరిగి యిచ్చేదువుగానిలే!" అని.

అందుకోసం వచ్చాడీవేళ! మొన్న నాకో వస్తువిస్తానన్నారు కదా—అంటే జ్ఞాపకం రాకుండా ఉంటుందీ?—సరే నన్నాను. కుర్చీలో కూర్చున్న మనిషి ఒక్కసారిగా నిట్టూర్చాడు!

"ఇంకా భోజనం చేయలేదు. యిస్తే వెళ్లొస్తాను."

"ఎందువల్ల ?"

"పదిగంటలనుంచీ స్టేషనుదగ్గర ఉండిపోయామండీ!"

"కారణం?"

"ఒక కంసాలి అమ్మాయి రైలుక్రిందపడి చనిపోయింది. అక్కడ చూస్తూ ఉండిపోయాం!" అన్నాడు.

అతనావిషయాన్ని కేవలం నిర్లిప్తంగా మాటసబబుకి చెప్పినట్టుగా మాత్రమే వెలువర్చాడు. కాని ఆమాటతోనే నేనెంతో షాక్ అయాను. "ఎవరూ ? ఎంచాతా ?" అంటూ కంగారుగా ప్రశ్నలు వేశాను. అతను వివరించడం ప్రారంభించాడు.

"మావీధే లెండి, కాంతం అంటారు. ఆమెభర్త వెండిపని చేస్తాడు. మంచినర్కారే! యిక్కడే పెద్దబజారులో అతనికొట్టు. ఆమెను మీరు చూసేఉంటారనుకుంటా! అన్నాడతను.

ఒక్కక్షణం ఆలోచించాను. "మీరామెను చూసే ఉంటారని" నొక్కివక్కాణించడం వల్లనో, మరెంచేతనో విపరీతమైన మనస్తాపం కలిగింది. కారణం తెలియదు. "ఎలా ఉంటుందామె?" అన్నాను.

"ఇరవై ఏళ్ళుంటాయి. అందంగానే ఉంటుంది. నొక్కు నొక్కుల తలా, నల్లగా చామన చాయగా ఉంటుంది"

అన్నాడు. ఇంతకీ కారణమేమిటో అతనింకా వివరించనేలేదు. మళ్ళీ అడిగాను. అతను:

"ఆమె తల్లిదండ్రులిద్దరూ ఈ ఊరే! భర్తదీ ఈ ఊరే. ఆమె యిష్టానికి వ్యతిరేకంగా పెళ్ళిచేశారు. పైగా పెళ్ళి జరిగినదగ్గర్నుంచీ కూడా ఆమెకి భర్తవల్ల సౌఖ్యంలేదు. అందుకనే మావీధి ఒక అబ్బాయి ఎర్రగాఉండాడు. అతనితో సంబంధం పెట్టుకుంది. అద్దాల వెంకటరాయుడి అల్లుడండీ! సూర్రావు సోడాషాపుదగ్గర మేమంతా కూర్చొనేవాళ్ళం. ఆవెనకాలే ఈ అమ్మాయి తాటాకు యిల్లు. ఎలా కలిసిందో మనకి తెలీదుగాని, కొట్టు వెనకాలి పెరటిగుమ్మం తలుపుతీసి ఉంచేది. వాడు ప్రతిరోజూ వెడుతుండేవాడు."

"సరే. తర్వాతేం జరిగింది?" అడిగాను ఆద్రుర్దాగా.

"అలాగే రామం ఆమె యింటికి వస్తూ పోతూ ఉండేవాడు. అతని కిష్టమైనదల్లా చేసిపంపుతూఉండేది. సరే తను లేకపోతే బ్రతకలేదని గ్రహించి ఆమె రమ్మన్నపుడల్లా ఏదో అవసరమనీ, డబ్బు కావాలనీ, డబ్బిస్తే వస్తాననీ కబురుచేసేవాడు. పాపం, ఆమెకి డబ్బు ఎలావస్తుందీ? వచ్చినపుడల్లా ఏదో బంగారపు వస్తువు వాడికిస్తూనే ఉండేది" అన్నాడు చక్రధరం.

అకస్మాత్తుగా నేనన్నాను: "సన్నగా బక్కపల్చగా పొట్టిగా ఉంటుంది కదూ! పెద్దకళ్ళూ, కొంచెం ఎత్తుపళ్ళూ

వుంటాయి. అవునా?" అన్నాను. ఏదో హఠాత్తుగా జ్ఞాపకం రావడమే కారణం!

"అబ్బే అంత సన్నగా వుండదండీ!" అన్నాడతను తాపీగా.

"అయితే ఎవరు చెప్మా? బంగారువస్తువులు కూడా యిచ్చేసిందన్నమాట! సరేలే, తర్వాత!"

"రోజురోజుకీ ఆమె వంటిమీదున్న కొద్దిపాటి నగలూ హరించుకుపోతూ వచ్చాయి,

రంకుతనం, దొంగతనం ఎన్నాళ్ళు దాగుతాయి చెప్పండి! కరిమేపీ మొగుడికి తెలిసిపోయింది. వాడు పగలు ఏదో సమయానికివచ్చి రెండు మెతుకులు కతికి, కొట్టుదగ్గరకు పోయేవాడు. రాత్రిళ్ళు బొత్తిగా యింటిమొహం చూసేవాడు కాదు. పైగా రోజూ వచ్చినప్పుడల్లా ఏదో వంకచూసుకొని ఆమెని చావకొడుతుండేవాడు. ఆమె అందరితోనూ చెప్పేది. "తనకీ జన్మలో సుఖంలేదనీ, ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటాననీ—" నాతో సైతం ఆ విధంగానే చెప్పింది. ఆ విధంగానే రెండుసార్లు నూతిలో పడింది. అదేమిటో చెప్పలేను. రెండుసార్లూ ఎవరో ఒకరు చూడ్డం, పైకితీయడంతోనే సరిపోయింది. మూడవసారి, ఏదో నాభీ నల్లమందూ నూరుకు తాగిందట, కాని ఆ దఫా కూడా ఫలితం పొందలేదు. కారణం ముందుగానే అందరికీ తెలిసిపోయింది. విరుగుడు పట్టేశారు.

మరోసారి ట్రెయిన్ క్రింద బుర్ర పెడదామనే ఉద్దేశంతో, రైలు వచ్చే సమయానికిముందే వెళ్ళి పట్టాలకడ్డంగా పడుకున్నదట. ఎవరో చూసి, బైటికిలాగి రెండుతన్ని పంపేశారట. ఈవేళ చేసిన ప్రయత్నం ఆఖరిది. ఇంక మళ్ళీ ప్రయత్నించాల్సిన అవసరం గాని, ఏవో బాధలనుభవించాల్సిన అవసరంగాని ఆమెకి లేదు' అన్నాడు చక్రధరం. చిన్నగా పేలవంగా నవ్వాడు. నేను మాత్రం నవ్వేస్థితిలో లేను. గోడమీది నా ఫోటో నవ్వుతోంది. అతను మళ్ళీ గుక్కమిలువుకున్నాడు. "రైలువస్తుంటే పక్కపక్కగా నడిచిందట కాస్సేపు. గార్డు, డ్రైవర్లు దూరంగా ఉండు" అంటూ అరుస్తూనేఉన్నారట. దూరంనుంచి పశువుల కుర్రాళ్ళు చూస్తూనే ఉన్నారట. గభాలున రైలు చక్రాలలో పడిపోయిందట. పడుతున్నపుడు తల గర్డరుకు గుద్దుకోవడంవల్ల కపాలం పెంకు నుదుటిమీద పూర్తిగా బద్దలైపోయి, మెదడు బైటికి వచ్చేసింది. చక్రం మీదినుంచి పోవడంతోటే మెడ నరాలన్నీ నలిగి తుత్తునియలైపోయాయి. ఒక్క గొంతుముడి దగ్గర తప్పితే పట్టేలేదు. తల వెనక్కిపోయింది. అబ్బా! భయంతో చూడలేక మొహం తిరిగిపోయిందండీ" అన్నాడు చక్రధరం.

చక్రధరం చెప్పినది కల్పనకాదు. కల్పించే శక్తి సామర్థ్యాలున్నవాడూ కాదు. కేవలం యథార్థదృశ్యం! ఆ విషయమంతా—చక్కగా సజీవంగా సాదృశ్యంగా వర్ణించి చెప్పడం నా యీ కథకోసంకూడా కాదు! తాను ఆ భీభత్సదృశ్యాన్ని

చూసినపుడు మానవుడుగా పడ్డదుఃఖంలో తోటివాణ్ణయిన నాకు పాలుపంచడం సహజం కాబట్టి మాత్రమే, ఆకలివేస్తున్న శ్రమతీసుకున్నాడు చక్రధరరావు! అంతకు తప్పితే మరేయితర స్వప్రయోజనమూ లేదు. అతను ఆ గాథ ముగించేసరికి ఇంచు మించు భిన్నుణ్ణయిపోయాను. ఏదో తెలీని — అవ్యక్తవిషాదంతో నా హృదయం అపస్మారకమైంది. అధో జ గ తి కి చూడు—లునిగిడ్చి—చేత్తో నుదుటిని గట్టిగా నొక్కుతూ— భారంగా ఆలోచనలు సాగిస్తున్నాను...

నా పరిస్థితిని అతను కనిపెట్టేడో లేదో మాత్రం నేను చెప్పలేను. అతనులేచి నుంచున్నాడు. ఒళ్ళు బద్ధకంగా విరుచుకున్నాడు. "నాకు దాన్నిస్తారా?—వెళ్ళొస్తాను!" అన్నాడు మామూలు-విధేయతతో...దానితో నా ఆలోచనా సమాధి నుంచి తెప్పరిల్లాను. లేచాను. లోపలికి వెళ్ళి నా ఫెల్టుహేటు తెచ్చి అతనికిచ్చాను. గౌరవపుస్సరంగా తీసుకున్నాడు. నా ఎదురుగా దాన్ని ధరించలేదు. సిగ్గుపడ్డాడల్లే ఉంది: చేత్తో పట్టుకొని వెళ్ళిపోయాడు.

నేను మళ్ళీ నా యథాస్థానంలో కూలబడ్డాను. తాగిన వాడి మానసిక శూన్యంతో భారంగా—ఆలోచనారహితంగా అలాగే కూర్చున్నాను. దేన్నిగురించీ ఆలోచించలేని మానసిక నీరసం ఎందువల్లో సన్నావరించింది. కాని, బొత్తిగా ఆలోచించకపోనూలేదు. నా లోపలి పొరుగుల్లోదాంకొని — సమ

యీసమయీ లెగకుండా, అడపాదడపా వెలుపలికి ఉబికివచ్చే శ్రీయుతులూ శ్రీమతులూ అంతా ప్రత్యక్షమవనారంభిం చారు...అదిగో, వాడు రమాకాంతం! వెకిలిగా నవ్వు తున్నాడు. "రామంగాడు చేసిన చీకటితప్పులవంటివి నేనన్ని చేయలేదూ?" అంటున్నాడు. అదిగో వాడు—గోపాలకృష్ణ మూర్తి! నిజంగా సార్థకనాముడు!! — "నీతి నియమాలు లేకుండా నేనెంత దుర్మార్గంగా బ్రతుకలేదూ?" అంటున్నాడు ...వాడు—విశ్వనాథం! మహానుభావుడు!" మాతంగ కన్యల నుంచి మహారాణులవరకూ ఎన్నిరకాల అనుభవాలు పొందా నో ఎవరికిలెక్క?" అంటున్నాడు. ఈ ముగ్గురు పురుషోత్త ములతోనూ రహస్యసంబంధాలు కలిగిఉన్న సీత, సావిత్రి, సుశీల, అహల్య, శ్యామల, శారద...వంటి పరదారలు— అందరూగాని, లేదా కొందరుగాని కాంతంనడచిన మార్గాన్నే నడవాల్సివచ్చినపుడు ఈ మహాపురుషులంతా ఏమవాతారు? ఈ ఘోరమైన సాంఘిక నేరాలకు బాధ్యులెవరు? ఈ రకమైన సజీవస్వప్నాల్ని పగటిపూట నాకు కలక్కపోలేదు.

* * *

లోగడ తుఫానుతో భూమి కొంత చల్లబడినా మేనెల కావడంవల్ల ఎండలు పునహా తమ ప్రభావాన్ని చూపక పోవడంలేదు. అందువల్ల శరీరానికి శైత్యోపచారంగా సాయం త్రం మళ్ళీస్నానంచేసి, నేను బయటికి బయల్దేరాను. శుభ్రమైన

బట్టలూ, సువాసన తైలం వగైరా ఆత్మానందకరాలు ధరించి నప్పటికీ మామూలు కూర్మావతారంలాగనే బయల్దేరాను. అప్పటికే ఆరు కావడంవల్ల తిన్నగా పార్కులోనికే పోయాను ప్రతిమూలా జనం ఎవరిగోడవల్లో వారు నిమగ్నులై ఉన్నారు ఆ జనంలో నేనెరుగున్నవాళ్ళూ—నన్నెరుగున్నవాళ్ళూ, పరిచయస్థులూ, మిత్రులూ, సన్నిహితులూ చాలామంది ఉన్నప్పటికీ ఏగుంపు దగ్గరకూ పోకుండా ఒకమూల సన్నని సిమెంటు తిన్నెమీద ఒంటరిగా కూర్చున్నాను. ఎవరితోనూ మాట్లాడడానికి మనసు అంగీకరించటంలేదు. కేవలం మానసమాధిలో కూర్మకవచవల్మీకంతో అనిర్వచీయమైన తపస్సే ఆధారంగా క్షణాలు దొర్లించదల్చుకున్నాను.

నిముషాలు గడుస్తూనే ఉన్నాయి. ఆంధ్రులకు చిరకాల మిత్రులైన తుఫానులూ, క్షామాలూ, కాటకాలు కనీసం మూడేళ్ళకొకసారైనా మనదేశంపై విహారం చేస్తూనే ఉంటాయి. ఈ ఈతిబాధలనుభవించడమే ఆంధ్రుల ఏకైక జన్మహక్కు! అంచాతనే లోగడ తుఫాను, రాయలసీమ గోరుచుట్టుమీద ఎలాంటి రోకటిపోట్లు వేసిందో రేడియో— తనకు కొత్తగా అందిన సమాచారాల్ననుసరించి వివరించుతుంటే వినడానికి ఉబలాటం కలుగలేదు. కేంద్రప్రభుత్వం తరపున నూతన ఆర్థికశాఖామాత్యుల ప్రవేశపెట్టిన కొత్త బడ్జెట్టు ఘనతగురించి రేడియో కంఠం హుందాగా వివరిస్తోంది.

బహుశా వార్తలు చదువుతున్నది పన్యాల రంగనాథరావు కావచ్చు! అయినా వినడానికి నాకేమీ అభిలాష కలుగలేదు.

"ఒరేయ్-కూర్మం!" అంటూ నా వెనుకనుంచి ఎవరిదో చేయి నా భుజాన్ని తట్టింది. ఆ చెయ్యి పట్టుకొని ముందుకు లాగి జరిగి కూర్చోబెట్టాను. ఇంకెవరు? మిత్రుడు విశ్వనాథం! ఆ కంఠంలోని నీరసాన్నిబట్టి—నడవడికలోని దైన్యతనుబట్టి ఏదో తప్పుచేసినవాడి పిరికితనంతో బరువెక్కిపోయినట్టు కనిపిస్తున్నాడు.

"ఏమిట్రా విశేషాలు?" అన్నాను. కొంచెం హుషారుగానే అన్నాను.

"ఆఁ—ఏమున్నాయిులే, కాని..." అంటూ ఆగాడు. మళ్ళీ ఏమనుకున్నాడో — "ఈవేళ ఉదయం ఒక విచిత్రం జరిగింది తెలుసా? ఒక అందమైన అమ్మాయి రైలుకిందపడి మరణించింది" అన్నాడు.

"ప్చ! పెద్ద విచిత్రమేముందిలే! ఇలాంటివి నిత్యమూ జరుగుతూనే ఉంటాయి! నేటి స్వచలిత సమాజానికి బహిరంగంగా కనిపించే మహాశక్తి స్వరూపం మాత్రమే ఈ రైలు!' అన్నాను.

"అదా మరి! అసలు సంగతి వినకుండా మాట్లాడకు మరి కవిత్వం!" అన్నాడు విశ్వనాథం.

దానితో నాకు అనుమానం కలిగింది. చక్రధరం చెప్పిన కాంతం కథ యింకా పూర్తి కాలేదన్నమాట! అనుకున్నాను. అంచాతనే ఆదుర్దాగా అడిగాను: "ఏమిటి చెప్పూ! కొంపతీసి ఈ కథతో నీకేమైనా సంబంధం ఉందా ఏమిటి?"

"నే చెప్పబోయేదదే! కంగారెందుకు? విను...అసలీ మనిషిని ఏడాదిక్రితం చూశానురా! పెద్దబజారునుంచి మీ యింటికి వచ్చేదారిలో సూరమ్మ యిల్లుంది చూశావూ— అక్కడ చూశాను. ఆమెకూడా నా వెంపు రెప్పవాల్చకుండా తదేకదృష్టితో చూసింది. అమ్మాయి బాగా నేఉంది; పైగా నేనంటే ఆకర్షణ కనబరుస్తోంది — ఇంకా కావలసిందేముంది? ఆ సూరమ్మ సంగతి నీకు తెలుసా? యిలాంటి వ్యవహారాల్లో కొంచెం సంధాన కార్యకలాపాలు సాగించకలదు; అంచాతనే మొన్నాడో ఎప్పుడో సూరమ్మనడిగాను..."ఇలా మీ యింటి వద్ద కనిపిస్తూందే ఆ అమ్మాయి ఎవరు? ఏమిటి సంగతి—నన్ను గట్టిగా చూస్తోంది? ... ఏమైనా పని జరుగుతుందా; వట్టి చూపులగొడ్డేనా?" అని. దానిమీదట ఆమె "నాకదిబంధువు. ఈవిషయంలో నేనేమీ మాట్లాడకూడదు మరి! బావుండదు.. నువ్వే ప్రయత్నించుబాబూ!" అంది. సరే, వీలుకలిగినప్పుడల్లా చూస్తూఉండేవాణ్ని. పెద్దప్రయత్నంకూడా ఏమీచేయలేదు. అయినా యిది ఏడాదిక్రితం సంగతి!" అన్నాడు విశ్వనాథం.

"అయితే యిప్పటి సంగతేమిటి?" అన్నాను, ఓపిక పట్టలేక.

విశ్వనాథం చెప్పడం ప్రారంభించాడు. ఎందుకో మనిషి బాధపడుతున్నాడనేందుకు, అతని గొంతుకే సాక్ష్యమిస్తోంది. "ఆమెకి మొగుడివల్ల వీసమెత్తు సౌఖ్యమైనా లేదట. అంచాతనే రామం అనే వాడితో సంబంధం పెట్టుకుంది. ఆ విషయం నాకు నిన్నటివరకూ తెలియదనుకో! అటు మొన్న సాయంత్రం ఈశ్వరుడిగుళ్ళో హరికథ చెప్పినపుడు ఆమె అక్కడికి వచ్చింది. నన్ను చూసి కళ్ళతో సంజ్ఞ చేసింది. వీధిలోకివచ్చి కిరీడలో నిలబడ్డాను. ఆమెగూడా వచ్చింది. ఇద్దరం ఆప్రక్క గతంలోకి తప్పుకున్నాం. కొంచెంసేపు అక్కడే ఏవో కబుర్లు చెప్పుకుంటూ గడిపాం. "రేపు మధ్యాహ్నం రెండుగంటలకి తిన్నగా మా యింటికి వచ్చేయండి. వీధిలోనే ఉంటాను" అంది. సరే, నిన్న ఆదివారం మధ్యాహ్నం ఆమె యింటికి వెళ్ళాను. నాకోసం అందంగా అలంకరించుకొని సిద్ధంగా కూర్చొనుంది. వెళ్ళీ వెళ్ళడంతోనే తలుపులు వేసి, ప్రక్కపై కూర్చొబెట్టింది. 'ముందు నా సంగతంతా వినండి" అంది. తన వివాహం తాలూకు దుఃఖగాధను వివరించింది. తరువాత రామం అనే ఆసామీతో తనకిగల సంబంధం గురించి చెప్పింది. "నా ఒంటిమీదున్నదంతా వలిచి ఆడికిచ్చాను. నన్ను నాశనం చేయడమే ఆడి ఉద్దేశమైతే నేనింకేంచేయను!—అంచాతనే మిమ్మల్ని రమ్మ

న్నాను. ఏడాదినుంచీ మీరు నాకోసం తిరుగుతున్నారు... మీరూ అతనిలాగ మారిపోరనే ధైర్యం ఉంది. అయినా ఒట్టెయ్యండి!'' అందామె. తరువాత నా జన్మలో ఎరుగని ఆనందాన్ని చేకూర్చింది. సరే.—ఆమెనుంచి శెలవు తీసుకొనివచ్చే ముందు "ఏదైనా మంచి చీర కొనుక్కో—!'' అంటూ పది రూపాయల కాగితం చేతిలో పెట్టాను. ససేమిరా పుచ్చుకోనంది ఏంచేయను? వచ్చేశాను...'' అన్నాడు విశ్వనాథం.

నిజమే, నాకు తెల్సుకదా. ఒక్కొక్కమారు విశ్వనాథం చేతికి ఎముకే ఉండదు. ''ఇంతవరకూ బాగానేఉంది. ఇప్పుడామె ఎందుకు ఆత్మహత్య చేసుకున్నట్టు?' అని ప్రశ్నించాను.

"ఏమో! అదే నాకూ యిప్పటివరకూ తెలియలేదు."

''పోనీ, ఆమెని నీతో వచ్చేయమనలేక పోయావా? వేరేకాపురం పెడుదువు కాదూ. పోషించలేవు గనకనా?''

''అసలంతవరకూ వచ్చిందేదోయ్? కథంతా మొదట్లోనే ఉందికదా. చచ్చిపోయే ముందయినా నాకు కనిపించి విషయాలన్నీ చెబితే నిక్షేపంలాగుండునే. వెంటనే నా కష్టడీలోకి తీసుకునేఉందును. ఎంత అపద్దిష్టపని చేసిందో చూడు, పిచ్చిది!'' అన్నాడు. గుద్ధమవుతున్న కంఠంలో కనుకొలకుల్లో నీళ్ళు తిరగడం కొంచెం దూరంలో ఉన్న ఎలక్ట్రిక్ దీపంకాంతిలో స్పష్టంగా మిలమిలలాడుతోంది.

"ఆఁ ... వీడో దొంగ వెధవ! తీరా మనిషి చచ్చి పోయింది కాబట్టి, యిపుడు ఉదారంగా చెప్పేస్తున్నాడు కబుర్లు. నిన్న కలిసినపుడు ఆ విషయం కాస్త సూచనగానైనా చెబితే యింత దారుణమెందుకు చేస్తుందీ స్త్రీ హృదయం!" అనుకున్నాను నా మనసులోనే. పైకి ఒక్కమాటైనా అనలేదు. కొంచెంసేపు యిద్దరిమధ్యా నిశ్శబ్దం మాత్రమే అలుముకుంది.

అతనే అన్నాడు. "పాపం, ఆమె ఆఖరిసారిగా ఆనందం అనుభవించింది నిన్న నాతోనే ఏమో!" బరువుగా నిట్టూర్చాడు విశ్వనాథం.

బాగా చీకటి పడింది. దక్షిణద్వారం అప్పుడే తెరచినట్టు గాలి "రయ్యి రయ్యి" మని వీచుతోంది. ఎంత బాధతో నిండిన గుండైనా యిట్టే చల్లారుస్తోంది. మౌనంగానే, యిద్దరంకలిసి బయల్దేరాం. చీలుబాటవరకూ కలిసేవచ్చాం. అక్కడ "సరే యింతకీమనమేం చేయగలంలే!" అనుకున్నాం. పరస్పరం అభినందించుకున్నాం. విడిపోయాం.

ఒంటరిగా మౌనంగా ఆలోచించుకుంటూ నడుస్తున్నాను.

ప్రసూతివైరాగ్యాన్నీ, స్మశానవైరాగ్యాన్నీ మించినదేదో విరక్తి నన్నావహించి, చిత్తుచేయ నారంభించింది. "ఈ సమాజపు విషవృత్తంలో పడిన ప్రతిఒక్కళ్ళమూ ఎరుగో ఎరక్కో— ఈ దుర్మార్గాలకి బాధ్యులమేనేమో!' అనుకున్నాను.

* * *

ఆలోచనల ఆ వేగంలో గబగబా అడుగులు వేస్తున్నాను. ఇంటికిపోయి ఈ ఆలోచనల పసిపిల్లలకి నీళ్ళోసిబట్టలు కట్టాలనే ప్రయత్నంకూడా లేకపోలేదు. తీరా, సూరమ్మ యింటిదగ్గరకు వచ్చిన తరువాతనే జ్ఞాపకంవచ్చింది. కాంతం మరణగాథలో సూరమ్మకి కూడా ఏమైనా పాత్రఉండక పోతుందా? అని.

ఆమె తరచు మాయింటికేదో పనిమీదరావడం, పిచ్చాపాటీ వేసుకోవడం, ఏమైనా పెడితే తీసుకోవడం వగైరా బాంధవ్యాలు ఆమెకీ మాయింటికీ లేకపోలేదు. అంచాతనే తలుపుగుద్ది, ధైర్యంగా "సూరమ్మామ్మా?" అన్నాను. భోజనంచేస్తూ వచ్చి తలుపుతీసింది. "నువ్వా కొడకా! ఏం బాబూ యిలా వచ్చావ్?" అంది ఆప్యాయంగా. "చూసేదో మాట్లాడిపోదామని వచ్చాను" అన్నాను. ఇదివరకుస్సైతం ఏదో పనిమీద ఆమె ఇంటికి వెళ్ళడం అలవాటు ఉంది కనక నా రాకను ఎబ్బెట్టుగా భావించలేదామె. "ఆ పడకకుర్చీ ఏసుక్కూకోచ్చ రాజు బాబూ! నావి అంటుచేతులూ" అన్నదామె.

ఆమె భోజనంచేస్తున్న దిక్కుకు పడకకుర్చీ వేసుకొని కూర్చున్నాను. "అవునుగాని సూరమ్మామ్మా! మీఇంట్లో ఉండేదే, ఆ అమ్మాయి రైలుకిందపడి చచ్చిపోయిందట ఏమిటి?" అన్నాను.

"అవున్నాయనా. మా యీరాచారి పెళ్ళాం. కొంప ముంచేసింది నాయనా..." అంది దుఃఖాన్ని ప్రతిధ్వనిస్తూ.

"సరే ఆమె చనిపోడానికి అసలు కారణమేమంటావ్?" అన్నాను.

సూరమ్మ గొంతుమార్చింది. 'బిడ్డలాంటివాడివి. నీతో చెప్పడానికేం, చెబుతా విను బాబూ! అసలు దానికీ మా యీరాచారికీ మొదట్నుంచీ పొత్తులేదనుకో; అదీ పైలా పచ్చీసు కుర్రదీ! అంచేత ఏ యీధిలో కెడితే ఆ యీధిలోనే నీ యీడు కుర్రాళ్ళతో సెలగ సెలగగా ఉండేదిట. పాపం పున్నెం నాకు తెలియదు సుమా, చెప్పుకోవడమేగాని. ఇప్పు డాయీధిలో కాదంటున్నారూ. అక్కడే అద్దాల యెంకట్రాయుడు అల్లుట్ట. ఎవర్లో నేనెరుగననుకో. ఆణ్ని ఉంచుకొం దిట, ఆడితోనే వుంటూ ముక్కుపుడక దగ్గర్నుంచి అన్నీ ఆడి యెదాన్ని కొట్టింది. సరే, ఆడితోనే ఎలాగోలాగ సరిపెట్టు కోవాలా? లోకంమీద యిదొక్కర్తే చేస్తోందా ఏమన్నానా? ఇంటింటాఉంది మట్టిపొయ్యి. ఇంత నలుగురినోట్లోనూ పడ్డంవా మరీను! చేసేదేదో జాగ్రత్తగా చేసుకోవాలా?' అంది సూరమ్మామ్మా. మరిరెండు ముద్దలుతిని మంచినీళ్లు తాగింది. గొంతు సవరించుకొంది.

'ఆ ఎదవసచ్చినోడు ఏరోజున డబ్బియ్యకపోతే ఆరోజే రానసేవాట్ట! ఏంచేస్తుంది — దానికీ ప్రాణం విసిగిపోయింది.

కొత్తపేటలో ఉంటారూ, విశ్వనాథం అంటారేం అతన్నెరుగవు బాబూ, నీలాగే ఉంటాడు ... అతనికీ దీనికీ ఏడాదికిందటే చూపులుకలిశాయి. అప్పట్నించి అతను దానికోసం చూస్తూనే ఉన్నాడు. ఆఖరికి నిన్న రమ్మందిట. ఎల్లేముందు నాక్కనిపించి చెప్పాడుసుమా! సరే, అతనెల్లడం రావడం; ఆ ఉంచుకున్నోడు చూశాడట. పెరటితలుపు గుద్దేట్ట. మామూలుగా తీసింది. "హాత్తేరి లంజకానా" అని జుత్తు దొరికించుకొని, పూచీ పుచ్చుకొని కొట్టాడట! లోపలిలా జరుగుతోంది. యీధి గుమ్మంలోంచి మొగుడు మా యీరాచారి తలుపుగుద్దాడట, సరే, గబగబా ఆ కుర్రాడు పెరటిగుమ్మంల్లోంచి అవతలికి పోయాడట. మొగుడు లోపలికొచ్చి చూచాడట. శుభ్రంగా ఏసిన పక్కా ... తీసివున్న పెరటిగుమ్మం ... ఆడికసలే అనుమానం! ఇంకేంగావాలి, ఆడుమళ్ళీ సావగొట్టాడంట. సరే, నీకూ నాకూ రుణం తీరిపోయిందని చెప్పి—అమ్మగారింటికెళ్ళి దానమ్మతోటీ, అప్పతోటీ జరిగిందంతా చెప్పి, "మీ పిల్లని మీరు జాగ్రత్త పెట్టుకోండన్నాడంట!" అని ఊపిరి పీల్చుకుంది సూరమ్మామ్మ. అకస్మాత్తుగా వెలుపల బీభత్సంగా గాలిదుమారం ప్రారంభమైంది. ఎవళ్ళో మాదాకవళంవాళ్ళ దీనకంఠం వినిపిస్తే "ఇంకా భోజనాలవలేదురా నాయనా" అంటూ జాలిగా మార్దవంగా చెప్పిపంపించేసింది సూరమ్మామ్మా. మళ్ళీచెప్పడం ప్రారంభించింది;

"రాత్తిరి రాత్రే — ఆళ్ళప్ప, పెద్దాపురం దగ్గరేదో ఊరులే, యిాళ్ళింటికొచ్చిందట. "నీకిదేం పోగాలమొచ్చిందే చచ్చిందానివీకాదు, బతికిందానివీ అయ్యేవుకావు! ఎంతమంది చెయ్యడంలేదే లంజా. యిలాగేనటే, వీధిపడ్డం? ఎంతమందికి తలొంపులు తెచ్చావ్ చూశావా?" అని నానామాటలూ అనేసిందట...అంతే, ఏడిచేడిచి ఎలా నిద్రపోయిందో, ఏటో; పొద్దున్న లేచి గుమ్మంలో కూకుందట. వీధిలో పడుకున్న యిారాచారి అప్పుడే లేచాడట..."అయితే నా బత్తెంమాటే టంటావ్? ఇంట్లో ఏమీలేవు!" అన్నాడంట. "నీకూ నాకూ నిన్నటితోటే ఋణం తీరిపోయిందే లంజకానా! నీ బత్తెంమాట నాకేం తెల్సు?" అన్నాడట నాయనా! అంతే— మనీధి గుమ్మంలోంచే ఎళ్ళిందటసుమా! మంచినీళ్ళ నూతిలో పడదా మనుకుందిట... కానీ అంతా ఉంటంమూలాంచి తిన్నగా సాధూగారి మఠందగ్గరికిపోయి కూర్చుందిట... అక్కడెవరో గొడ్లకాడ కుర్రాళ్ళు యీతపళ్ళు కోట్టుకొని రెండు పెడితే తిందటకూడాను! అంత్తే— పదిగంటల బండికిందపడి చచ్చిపోయింది నాయనా!" అంది సూరమ్మామ్మ... సూరమ్మామ్మ ఏ విషయాన్నయినా ఎంతో నేర్పుగా కథచెప్పినట్టుగా చెబుతుంది. ప్రతిమాటా సాగతీసి పలుకుతూ నాజూకైన సంగీతం ధ్వనింపచేస్తూ ఉంటుంది. ముఖ్యంగా నాయనా అన్నపదాన్ని ఎంత హృద్యంగా ఉచ్చరిస్తుందో!

సాలోచనగా సూరమ్మామ్మ మళ్ళీ అందుకుంది. "ఆడదానికే బాబూ నానా రంబారాయిళ్ళాను. మొగ మహారాజు కేం హాయిగా బ్రతుకుతాడు. కానీ మా యీరాచారి దుఃఖం చూడలేకపోతున్నా బాబూ! పెద్దమ్మా నువ్వే కాచిపెట్టు అన్నాడు. ఇక్కడే భోంచేస్తున్నాడు నాయనా. యిప్పుడొస్తాడు?" అంది. నిజంగా ఆమె కంఠస్వరం మారిపోయింది.

"అయ్యోపాపం!" అన్నాను.

"ఎవరేంచేస్తాంలే—దానికలాంటి చావురాసుంది."

"నిజమే మరి, సరే వస్తాను మామ్మా. మళ్ళీ వర్షం వచ్చేలాగుంది" అని యింటికి చక్కావచ్చాను.

నాకు తెలుసు. యిలాంటి దారుణహత్యలకు గురిచేయబడుతున్న అభాగ్యజీవుల్లో కాంతం మొదటిదికాదు. ఇంతకీ ఆమె మరణానికి కారణభూతులెవరు? ఈ మహాసమస్య జిమ్మిన నిప్పులసెగకు నా కూర్మకవచమే పటేలుమని పగిలిపోతుందేమో అనే భయం కలుగకపోలేదు. పాపం! కాంతం విషాదజీవితానికీ, ఘోరమరణానికీ నానుంచి కంపోజిటర్ వరకూ ఈ సమాజంలోని ప్రతిఒక్కళ్ళమూ ఎలాగోలాగ బాధ్యులమేనేమో?

[రచన : 24 మే 1952]